సాక్షి
కుమురం భీం

గురువారం ౹ 30 ౹ మార్చి ౹ 2023




కాగజ్‌నగర్‌లో ర్యాలీ
కాగజ్‌నగర్‌టౌన్: జీరో వేస్ట్ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల దశ జీవితానికి పునాది
జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో బుధవారం వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. 11లో ▸

గరిష్టం/కనిష్టం
39.1/24.7

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి. ఉక్కపోత అధికమవుతుంది.



ఇఫ్తార్ గురు : 6:29
సహర్ శుక్ర 4:49

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. లింగాపూర్ మండలం పిట్టగూడలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు మాట్లాడుతూ సంక్షేమ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, లింగాపూర్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్, ఎంపీపీ సవిత, జెడ్పీటీసీ రక్కబాయి, వైస్ ఎంపీపీలు ఆత్మారాం, ఆత్రం ప్రకాశ్, జైనూర్ ఏఎంసీ చైర్మన్ భగవంత్‌రావు, నాయకులు ధర్మారావు, ఇంతీయాజ్ లాలా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



కౌటాలలో విద్యార్థుల సందడి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జనరల్ కెమెస్ట్రీ, కామర్స్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4,399 మంది విద్యార్థులకు 4,251 మంది హాజరుకాగా, 148 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 3,737 మంది, ఒకేషనల్ 514 మంది పరీక్షలు రాసినట్లు డీఐఈవో తెలిపారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



పీసీ జైన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన న్యాయవాది బోనగిరి సతీశ్‌బాబు మూడోసారి విజయం సాధించారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా రాపర్తి రవీందర్, ఉపాధ్యక్షుడిగా ఎండీ మునీర్ గెలుపొందారు. సంయుక్త కార్యదర్శిగా మాళికర్ శ్రీనివాస్, కోశాధికారిగా మంథెన చరణ్ తేజ, లైబ్రరీ సెక్రెటరీగా ధీరజ్ భౌమిక్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీగా ఉస్మాన్, లేడీస్ రిప్రెజెంటేటివ్‌గా గాయత్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌చంద్ జైన్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. చీఫ్ అడ్వయిజర్లుగా సీని యర్ న్యాయవాదులు టి.సురేశ్, ఎం,సురేశ్, జగన్‌మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, రవీందర్‌రెడ్డి, పీసీ జైన్‌ను ఎన్నుకున్నారు.



దహెగాంలో సాగు చేసిన వరి

రైతుబంధు రాలె

- యాసంగిలో పూర్తిస్థాయిలో అందని పెట్టుబడి సాయం
- జిల్లాలో 1,748 మంది రైతులకు తప్పని ఎదురుచూపులు
- సమాచారం లేదంటున్న వ్యవసాయశాఖ అధికారులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు

దహెగాం(సిర్పూర్): పెట్టుబడి కోసం రైతులు ఇబ్బంది పడకుండా ఆర్థికంగా సాయమందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేస్తోంది. ప్రారంభంలో ఎకరానికి రూ.4వేలు ఇవ్వగా, ప్రస్తుతం ఎకరానికి రూ.5వేల చొప్పున ఏడాదిలో రెండు సార్లు అందజేస్తున్నారు. అయితే జిల్లాలోని పలువురు రైతులకు సాంకేతిక కారణాలతో ఇప్పటివరకు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు సాయం ఖాతాల్లో జమ కాలేదు. పదెకరాల పైన భూమి ఉన్న వారికి ఈ సమస్య తలెత్తుతోందని రైతులు చెబుతున్నారు.

అప్పుల కోసం తిప్పలు..
పంటల సాగుకు పెట్టుబడి సాయం ఉపయోగపడుతుందని ఆశగా ఉన్న రైతులకు నిరాశే ఎదురైంది. వానాకాలం సీజన్‌లో ఎలాంటి పరిమితి లేకుండా ఎన్ని ఎకరాలు ఉన్నా రైతు బంధు అందింది. యాసంగిలో మాత్రం జిల్లాలో 1,748 మంది ఖాతాల్లో జమ కాలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో పంటలు కొట్టుకుపోగా మరోసారి విత్తనాలు విత్తుకోవాల్సి వచ్చింది. అధిక వర్షాలతో దిగుబడి కూడా ఆశించిన రీతిలో రాలేదు. ఇప్పటి వరకు రైతుబంధు పథకం కింద అందించే పెట్టుబడి సాయం రైతులకు ఎప్పుడు జమ చేస్తారో అనే దానిపై వ్యవసాయశాఖ అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పలేకపోతున్నారు. రైతులు మాత్రం నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్ని ఎకరాల వరకు ప్రభుత్వం కటాఫ్ చేసిందో కూడా స్పష్టమైన సమాచారం లేదు. దీంతో రైతులు మరింత అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం స్పందించి పెట్టుబడిసాయం ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు ఎదురుచూపులు..
డిసెంబర్‌లో యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ముందుగా ఎకరం, రెండెకరాలు, మూడెకరాలు.. ఇలా పదెకరాల వరకు దశల వారీగా రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసింది. అయితే పదెకరాలపైన భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అందలేదని తెలుస్తోంది. అందులో కూడా కొందరికి జమ అయినట్లు రైతులు చెబుతున్నారు. ఏ కారణంతో నగదు జమ కాలేదో వ్యవసాయ శాఖాధికారులకు కూడా సమాచారం లేదు. జిల్లాలో మొత్తం 1,14,448 మంది రైతులు ఉన్నారు. వీరిలో బ్యాంకు వివరాలు అప్‌డేట్ చేసుకున్న వారు 1,13,702 మంది ఉన్నారు. 1,13,701 మంది వివరాలను ట్రెజరీకి పంపించారు. ఇప్పటివరకు 1,11,953 మంది రైతులకు రూ.177,35,84,563 నగదు ఖాతాల్లో జమ అయింది. ఇంకా 1,748 మంది పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఇంకా రాలేదు



రైతుబంధు పైసలు నాకు ఇంకా జమ కాలేదు. 24 ఎకరాల భూమి ఉంది. వానాకాలంలో డబ్బులు నా ఖాతాలో పడ్డాయి. యాసంగి డబ్బులు రాలేదు. వర్షాకాలంలో పంట మొత్తం వరదలకు కొట్టుకుపోయింది. పత్తి దెబ్బతినడంతో యాసంగిలో మొక్కజొన్న వేసిన. పెట్టుబడి, పురుగుమందులు, ఎరువుల కోసం అప్పు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం స్పందించి రైతుబంధు డబ్బులు జమ చేయాలి.
– వెల్మలే మురళి, రైతు, ఐనం

విడుదల చేయాలి



యాసంగి సీజన్‌లో 14 ఎకరాల్లో పంటలు వేసిన. వానాకాలంలో వచ్చినా.. యాసంగికి సంబంధించిన రైతు బంధు సాయం ఇప్పటి వరకు రాలేదు. జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీ కూడా పెట్టిన. అందరికీ డబ్బులు పడతాయని కలెక్టర్ సార్ చెప్పిండు. ప్రభుత్వం తొందర నగదు విడుదల చేయాలి. పంటల పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా చూడాలి.
– లాట్కర్ రామన్న, రైతు, రాంపూర్

ట్రెజరీలోనే పెండింగ్
జిల్లాలో రైతుబంధు పథకానికి అర్హులైన రైతుల వివరాల జాబితాను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు అందించాం. వారు రాష్ట్ర ట్రెజరీ ద్వారా రైతుల ఖాతాల్లో దశల వారీగా జమ చేస్తున్నారు. ఇంకా జిల్లాకు సంబంధించి 1,748 మంది వివరాలు ట్రెజరీ వద్దే పెండింగ్‌లోనే ఉన్నాయి. పదెకరాల పైన ఉన్నవారికి జమ కాలేదు. త్వరలోనే నిధులు విడుదలవుతాయి. రైతులు ఆందోళన చెందొద్దు.
– శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్, డీఈవో

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ కార్యదర్శి దేవసేన, ఉన్నతాధికారులతో కలిసి వార్షిక పరీక్షల నిర్వహణపై కలెక్టర్లు, డీఈవోలు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 13 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు 39 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,151 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, అలాగే వైద్యసిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు, ఇతరవాహనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించామని వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఆర్డీవో రాజేశ్వర్, డీపీవో రమేశ్, పరీక్షల కోఆర్డినేటర్ ఉదయ్‌బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

- 50 యూనిట్లకు 752 దరఖాస్తులు
- పలువురి దరఖాస్తులు గల్లంతు.. అయోమయంలో దరఖాస్తు దారులు
- బ్యాంకు, మున్సిపల్ అధికారుల తీరుపై నిరసన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీ వర్గానికి చెందిన ప్రజలకు మైనార్టీ కార్పొరేషన్ నుంచి అందించాల్సిన సబ్సిడీ రుణాల కోసం బుధవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఇంటర్వ్యూల ప్రక్రియ నామమాత్రంగా సాగిందని పలువురు దరఖాస్తుదారులు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 50 యునిట్ల రుణాలు మంజూరు కోసం 752 మంది మూడు నెలల క్రితమే దరఖాస్తు చేసుకున్నారు. ప్రతీ యూనిట్‌కు రూ.లక్ష, రూ.2 లక్షల చొప్పున కేటాయించడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఎంతో మంది గంపెడాశలతో ఇంటర్వ్యూలకు హాజరైనా బ్యాంకు అధికారులు, మైనార్టీ కార్పొరేషన్, బల్దియా అధికారుల నుంచి స్పందన లభించకపోవడంపై వారు నిరసన తెలిపారు. కేంద్ర సహకార బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఐఓబీ బ్యాంకు తదితర బ్యాంకుల నుంచి మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. మరోవైపు పలువురి దరఖాస్తులు గల్లంతు కావడంతో కొంత మంది ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారుల సూచన మేరకు మళ్లీ దరఖాస్తులు అందజేశారు. మొదట 25 యూనిట్లు మాత్రమే ఉండగా మంగళవారం రాత్రి మరో 25 యూనిట్లను మంజూరు చేస్తూ మైనార్టీ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి. దీంతో మొత్తం 50 యూనిట్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జిల్లా మైనార్టీ అధికారి రబ్బానీ, మెప్మా ప్రతినిధులు మోతీరాం, ఉష తదితరులు పాల్గొన్నారు.

కానుకలు వచ్చేశాయ్!

- జిల్లాకు చేరిన రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లు
- 3,500 మంది ముస్లింలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు
- ఇఫ్తార్ విందుకు రూ.7లక్షలు మంజూరు



పంపిణీకి సిద్ధంగా ఉన్న గిఫ్ట్ ప్యాక్‌లు

ఆసిఫాబాద్‌అర్బన్: రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కానుకలు జిల్లాకు చేరుకున్నాయి. ఈ ఏడాది జిల్లాకు ప్రభుత్వం 3,500 గిఫ్ట్ ప్యాక్‌లను కేటాయించింది. కాగజ్‌నగర్ డివిజన్‌కు సంబంధించిన గిఫ్ట్ ప్యాక్‌లను కాగజ్‌నగర్ షాదీఖానాలో భద్రపర్చగా, ఆసిఫాబాద్ డివిజన్‌కు సంబంధించిన కానుకలను బాబాపూర్ సమీపంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిల్వ ఉంచారు. ఈ నెలాఖరులోగా మండలాల వారీగా లబ్ధిదారులకు కానుకలు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జిల్లాలో ఇఫ్తార్ విందుల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.7లక్షలు మంజూరు చేసింది.

త్వరలోనే మండల కేంద్రాలకు..
రాష్ట్ర ప్రభుత్వం ఏటా రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు గిఫ్ట్ ప్యాక్‌లు అందజేస్తోంది. ఇందులో ఒక చీర, షర్వాన్, ఖమీజ్, కుర్తా, పైజామా ఉంటాయి. వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథలు, నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తారు. జిల్లాకు రెండు నియోజకవర్గాలకు కలిపి 3,500 ప్యాక్‌లను కేటాయించారు. ఇందులో సిర్పూర్ నియోజకవర్గానికి 2,000, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 1,500 కానుకలు మంజూరు చేశారు. ఈ రంజాన్ తోఫాలను త్వరలోనే మండల కేంద్రానికి సరఫరా చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అలాగే ఇఫ్తార్ విందుల కోసం మొత్తం రూ.7లక్షలు మంజూరు చేయగా, ఇందులో సిర్పూర్ నియోజకవర్గానికి రూ.4లక్షలు, ఆసిఫాబాద్ డివిజన్‌కు రూ.3 లక్షల నిధులు వినియోగించనున్నారు. ఇఫ్తార్ విందులను ముస్లిం కమిటీలు సూచించే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు.

నోడల్ అధికారి పర్యవేక్షణ..
రంజాన్ తోఫాల పంపిణీ బాధ్యతను ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకరి చొప్పున నోడల్ అధికారులను నియమించింది. అర్హులైన వారికి గిఫ్ట్ ప్యాక్‌లు అందేలా చూడాల్సిన బాధ్యత సదరు అధికారిపై ఉంటుంది. మండలాలకు తహసీల్దార్లు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు. ముస్లింలకు త్వరలోనే రంజాన్ కానుకలను పంపిణీ చేస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ మహమూద్ తెలిపారు.

కల్యాణోత్సవానికి ‘జానకీపురం’ ముస్తాబు

- నేడు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో శ్రీసీతారాముల కల్యాణం
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి



జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయం



ఆలయంలో కొలువుదీరిన సీతారాములు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జానకీపురం(జన్కాపూర్) కోదండ రామాలయం శ్రీరామనవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణానికి ముస్తాబైంది. వారం రోజులపాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భూమి చదును చేశారు. షామియానాలు, చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. జన్కాపూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు సీతారాముల కల్యాణ మంత్రోచ్చరణలు వినిపించేలా రాష్ట్రీయ రహదారి పొడవునా మైక్‌లు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం రాజంపేటకు చెందిన తుజాల్‌పూర్ మురళీగౌడ్ నివాసం నుంచి కోదండ రామాలయం వరకు ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

ఆలయ చరిత్ర
కాకతీయుల దీక్షాదక్షతలకు గుర్తుగా ఏడెనిమిది దశాబ్దాలుగా జన్కాపూర్ కోదండ రాముడికి పూజలు నిర్వహిస్తున్నారు. అప్పట్లో నిర్మించిన త్రికుటాలయం పూర్తిగా శిథిలమైంది. ఈ క్రమంలో ఒకప్పటి జనగామ, ప్రస్తుత ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో స్వర్గీయ రాంచందర్‌రావు పైకాజీ 1970లో ఆలయ నిర్మాణం చేపట్టి సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయంలో ఏటా శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు నెరవేరడంతో ఆలయం నిత్యం భక్తులతో కోలాహలంగా ఉంటుంది. పర్వదినాల్లో అన్నదానాలు, భజనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి. గణేశ్ నవరాత్రుల్లో వినాయకుడు, దుర్గా నవరాత్రుల్లో శారదామాత విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సహకారంతో జన్కాపూర్ వాసులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని మళ్లీ పునర్నిర్మించారు. ఆలయంలో సీతారాముల విగ్రహాలతోపాటు శివలింగం, షిర్డీ సాయినాథుడు, ఈశాన్యంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. దాతల సహకారంతో కల్యాణ మంటపం కూడా నిర్మించారు.

నేడు సీతారాముల కల్యాణం
ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, 4.30 గంటలకు సీతారాములకు అభిషేకం, 9 గంటలకు ఆసిఫాబాద్ నుంచి ఆలయం వరకు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో హనుమాన్ దీక్షాస్వాముల శోభాయాత్ర, 11 గంటలకు కల్యాణ ఘట్టం ప్రారంభం, 11.30 గంటలకు కన్యాదానం, మధ్యాహ్నం 12.15 గంటలకు సీతారాముల కల్యాణం, అనంతరం మహాప్రసాదం (అన్నదానం), సాయంత్రం 6 గంటలకు పల్లకిసేవ, రాత్రి 8 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేసవి ప్రతాపం నుంచి ఉపశమనం కోసం ఆలయం వద్ద బెల్లం పానకం, మజ్జిగ, తాగునీటిని అందుబాటులో ఉంచనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. గురువారం నిర్వహించే కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

దహెగాం(సిర్పూర్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. దహెగాం మండలంలో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున సెల్‌ఫోన్లు దూరం పెట్టి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. నర్సరీని పరిశీలించి ఏఏ మొక్కలు పెంచుతున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఎంపీడీవో, ప్రాథమిక పాఠశాల, బీబ్రా ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. ఎంపీడీవో రాజేశ్వర్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ప్రిన్సిపాల్ అమరేందర్, పీఆర్ ఏఈ ఆత్మారాం, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు పాఠాలు బోధన
మండల పర్యటనలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉపాధ్యాయురాలిగా మారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

- ఎస్పీ సురేశ్‌కుమార్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన అవసరమని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల గుండెపోటు మరణాలు పెరిగిన నేపథ్యంలో సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవడం ముఖ్యమన్నారు. ఒక వ్యక్తి వివిధ కారణాలతో అపస్మారక స్థితిలో ఉలుకుపలుకు లేకుండా ఉంటే ముందుగా అతడిని తట్టి లేపుతూ మెదడును ఉత్తేజితం చేయాలన్నారు. అయినా స్పందించకుంటే నాడి పనిచేస్తుందా.. లేదా..? అని పరీక్షించి, పనిచేయకుంటే అంబులెన్స్, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంబులెన్స్ చేరుకునే వరకు సీపీఆర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. సదరు వ్యక్తి ఛాతిపై నిమిషానికి 100 నుంచి 120 సార్లు ఒత్తిడి తేవాలన్నారు. ఇలా చేసేటప్పుడు దవడ భాగాన్ని పైకి లేపి ఉంచాలని, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అంది మనిషి బతికేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆపత్కాలంలో పోలీసులు వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీంరావు, సీపీఆర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ సంతోష్ డాక్టర్లు రాజు, సుజిత్, సిబ్బంది పవన్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్ ఉన్నారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్‌లోని టింబర్‌యార్డు, ఏరియా స్టోర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కార్పొరేట్ చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టోర్స్ మెటీరియల్ ఇస్యూవర్ రెండు పోస్టులు ఏళ్ల తరబడిగా భర్తీ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, నాయకులు కాశీరావు, అద్దు శ్రీనివాస్, జీ.సదానందం, నీరటి లక్ష్మణ్, రమణారావు, విష్ణుప్రసాద్, నిరంజన్‌రెడ్డి, కుమారస్వామి, ఎడ్ల వెంకటయ్య, లంక రామస్వామి పాల్గొన్నారు.

‘డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలివ్వాలి’



మాట్లాడుతున్న రామిల్ల రాధిక

మందమర్రిరూరల్(చెన్నూర్): డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలివ్వాలని సంఘం అధ్యక్షురాలు రామిల్ల రాధిక డిమాండ్ చేశారు. బుధవారం వివిధ పార్టీల నాయకులతో కలిసి దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిస్మిస్ కార్మికులు 19 సంవత్సరాలుగా దీక్ష చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ప్రతిరోజు దీక్షా శిబిరం ముందునుంచే కార్యకలాపాలకోసం వెళ్లే నాయకులు, అధికారులకు కార్మికుల గోడు కనిపించడంలేదన్నారు. సింగరేణి గుర్తింపు, సాధారణ ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన తర్వాత ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉద్యోగాలు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు నర్సింగ్, దీక్షితులు, సంఘం నాయకులు రవీందర్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులోని పేకాట స్థావరంపై బుధవారం రాత్రి ఖానాపూర్ ఎస్సై ఆర్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ముగ్గురి వద్ద నుంచి రూ.4500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫలం.. పోషకాలు పుష్కలం

- రోజా విరమణలో వినియోగం
- రంజాన్ మాసంలో ప్రత్యేకం



పోషకాలను ఇచ్చే పండ్లు

నెన్నెల(బెల్లంపల్లి): రంజాన్ మాసం వచ్చిందంటే పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. ఇఫ్తార్ దీక్ష విరమణకు ముస్లింలు ఎక్కువగా పండ్లనే ఇష్టపడుతారు. ఎందుకంటే వాటిలో పోషకాలు అధికంగా ఉండడమే కారణం. సుమారు 15 గంటల పాటు ఉపవాసం ఉండి సాయంత్రం దీక్ష విరమణ సమయంలో పోషకాలు అధికంగా ఉండే ఫలాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు పేర్కొంటున్నారు. తాజా పండ్లతో పాటు డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు.

పోషకాల ఖర్జూర..

ఖర్జూరలో తక్షణ శక్తినిచ్చే పోషకాలు ఉంటాయి. మహ్మద్ ప్రవక్త రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సమయంలో వీటినే ఎక్కువగా తీసుకునే వారు. చాలా మంది సున్నత్(మహ్మద్ ప్రవక్త ఆచారం)లో భాగంగా ముందుగా ఖర్జూర పండ్లతోనే ఉపవాసదీక్షలు విరమిస్తారు. ఆ తర్వాతే ఇతర ఫలాలు తింటారు. ఈ క్రమంలో వాటి గిరాకీని తట్టుకునేందుకు రంజాన్ మాసంలో వ్యాపారులు విదేశాల నుంచి కూడా మేలు రకమైన ఖర్జూరను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇందులో విటమిన్‌లు బీ-1, బీ-2, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి.

శక్తినిచ్చే ఎండుఫలం

ఎండుఫలాలు మంచి శక్తినిస్తాయి. సౌదీలో ఎండు ఫలాలు అధికంగా లభిస్తాయి. మహ్మద్ ప్రవక్త దీక్ష విరమణ కోసం ఎండుఫలాలైన ఖర్జూర, కాజు, బాదం, పిస్తా, అక్రోట్‌లను అధికంగా తినేవారని చరిత్ర చెబుతోంది. ఈ ఎండు ఫలాల్లో అధిక పోషకాలు ఉంటాయి. దీంతో ముస్లింలు రోజా విరమణ కోసం ఇఫ్తార్‌లో వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. తర్బూజ, కర్బూజ, బత్తాయి, ద్రాక్ష, సంత్రాలలో దాహం తీర్చే గుణాలు ఉంటాయి. విటమిన్లు, పీచు పదార్థాలు ఉంటాయి. అరటిలో విటమిన్-ఏ, కాల్షియం ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

రోజా విరమణకు ఖర్జూర శ్రేష్ఠం



మహ్మద్ ప్రవక్త ఖర్జూర పండుతోనే రోజా విరమణ చేసే వారని ఖురాన్‌లో పేర్కొన్నారు. వీటిలో బీ-1, బీ-2, కాల్షియం, పోషక విలువలు మెండుగా ఉంటాయి. అందుకే వివిధ దేశాల్లో రోజు విరమణకు ముందుగా ఖర్జూరనే ఉపయోగిస్తారు.

– మహ్మద్ ఇబ్రహీం ఖాద్రి

డీహైడ్రేషన్ దూరం



రోజుకు సుమారు 15 గంటల పాటు అన్నపానియాలు ముట్టుకోకుండా కఠిన ఉపవాస దీక్ష ఉంటుంది. రోజా విరమణ సమయంలో పండ్లు తీసుకుంటే శక్తితో పాటు శరీరానికి కావాల్సిన నీటిశాతం అందుతుంది. ఇఫ్తార్‌లో పండ్లు తీసుకుంటే ఆహారం సులువుగా జీర్ణమవుతుంది. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ఉపవాస దీక్ష విరమణకు పండ్లు తీసుకుంటారు.

– యూనిస్ రజాఖాద్రి హాఫీజ్, బెల్లంపల్లి

పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

పాతమంచిర్యాల: ఉద్యోగుల జీవన భద్రతను హరిస్తున్న కొత్త పింఛన్ విధానం రద్దుచేసి బీమా సంస్థల ఉద్యోగులకు పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వ రంగ సంస్థల్లో సేవలు అందిస్తున్న ఉద్యోగుల పింఛన్ సొమ్మును ప్రభుత్వం స్టాక్ మార్కెట్‌లో పెట్టడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల బేసిక్ వేతనంలో 30 శాతం కనీస పింఛన్ చెల్లించాలని, ఎల్ఐసీ, జీఐసీల ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీమా ఉద్యోగుల సంఘం మంచిర్యాల శాఖ అధ్యక్షుడు గోపీకృష్ణ, సంయుక్త కార్యదర్శి చరణ్, కరీంనగర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి ఆర్ రాజేశం, తిరుపతిరెడ్డి, సమత్‌కుమార్, హిమశ్రీ,సోనీ, మౌనిక, సుష్మ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులంతా ‘భగీరథ’ నీటినే తాగాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులంతా మిషన్ భగీరథ నీటినే తాగేలా చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నయీంపాషా బుధవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎమ్మెల్యే కార్యాలయాల్లో మిషన్ భగీరథ పైపు లైన్లు వేసి నల్లా కనెక్షన్లు ఇచ్చి కలెక్టర్, ఎమ్మెల్యేతో సహా అధికారులంతా ఆనీటినే తాగాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాల్లో మినరల్ వాటర్‌ను మాని మిషన్ భగీరథ నీటిని తాగి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి మినరల్, ప్యూరిఫైడ్ వాటర్ అనుమతించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు నల్ల నాగేంద్రప్రసాద్, విజయ్, శ్రీకాంత్, కళ్యాణ్, రాజేందర్ పాల్గొన్నారు.

గడువు తీరిన పాల ప్యాకెట్ల అమ్మకాలు!



గడువు తీరిన పాల ప్యాకెట్

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కొర్విచెల్మలో ఓ కిరాణ దుకాణంలో గడువు తీరిన పాల ప్యాకెట్ల (సోయ పాలు) విక్రయం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాస్వాములు బుధవారం కిరాణ దుకాణంలో పూజాసామగ్రితో పాటు, పాలు కొనుగోలు చేశారు. దీంతో దుకాణం యజమాని వారికి గడువు తీరిన పాల ప్యాకెట్లు ఇవ్వడంతో వాటిని గమనించిన స్వాములు నివ్వెరపోయారు. పాల ప్యాకెట్ల గడువు గత నెల 27 వరకే ఉంది. గడువు ముగిసి నెల రోజులు దాటినా వాటినే ప్రజలకు విక్రయించడంపై మండి పడ్డారు. విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు.

నెన్నెలలో పురాతన రాతి విగ్రహం లభ్యం



పూజలు చేస్తున్న స్వాములు

నెన్నెల(బెల్లంపల్లి): మండలం కేంద్రంలోని పెద్ద చెరువులో పురాతన వినాయక రాతి విగ్రహం ఉన్నట్లు హనుమాన్ దీక్షాపరులు గుర్తించారు. విగ్రహాన్ని బయటకు తీసి ఒక చెట్టు కింద ఉంచి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఇది సుమారు 800ల సంవత్సరాల క్రితం నాటిదని, చాళుక్యులు దేవాలయం గర్భగుడి ద్వారానికి పైభాగానికి సంబంధించిన రాతి విగ్రహమని గన్‌పూర్‌కు చెందిన చారిత్రక, పురావాస్తు పరిశోధకుడు పంజాల సాయిరాం తెలిపారు.

ఎడ్లు చోరీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌కు చెందిన రైతులు వైరాగడే ఆనంద్‌రావు, వైరాగడే శ్రవణ్, మెంగ్రె బాబురావుకు చెందిన ఎడ్లు ఉదయం మేత కోసం బయటకు వెళ్లాయి. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో రైతులు శివారు ప్రాంతంలో వెతికేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గుండి రహదారి సమీపంలోని ఒర్రె వద్ద మూడు ఎడ్లు చెట్టుకు కట్టేసి ఉండడంతో వాటిని వదిలేసి ఇంటికి తరలించారు. గతంలో సైతం జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఆవులు సైతం అదృశ్యమయ్యాయి. కొంత మంది వ్యక్తులు పశువులను బంధించి, కబేళాలకు తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా..

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా-బాసర రహదారిపై బుధవారం వేకువజామున లారీ అదుపుతప్పి బోల్తాపడింది. భైంసాలోని కాటన్ జిన్నింగ్ మిల్లు నుంచి పత్తి బేళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ స్థానిక హరియాలీ ఫంక్షన్‌హాల్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీలో పత్తిబేళ్లు కింద పడిపోయాయి. డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. 161 బీబీ రహదారి పనుల్లో జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పనులు జరుగుతున్న చోట హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డీడీలు చెల్లించి ఇళ్ల పట్టాలు పొందాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



డీడీలు చెల్లించాలని సూచిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని డీడీలు చెల్లించని పలువురి ఇళ్లకు బుధవారం అదనపు కలెక్టర్‌తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనుందని, వెంటనే డీడీలు చెల్లిస్తే ఇంటిపై సర్వహక్కులు పొందవచ్చన్నారు. ఆయన వెంట ఆర్డీవో వేణు, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాలువ నీటిలో గల్లంతై యువకుడు మృతి



మల్లేశ్ మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): ప్రమాదవశాత్తు కాలువ నీటిలో గల్లంతై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్యంపేటకు చెందిన ఒర్సు మల్లేశ్ (22) బుధవారం సాయంత్రం మిత్రులతో కలిసి కాలువలో స్నానం చేసేందుకు వెళ్లాడు. లిఫ్టు డెలివరీ పాయింట్ సమీపంలోనే కాలువలోకి దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటిప్రవాహం ఎక్కువ రావడంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన మిత్రులు నీటిలో గాలించినా దొరకకపోవడంతో పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సాంబమూర్తి ఈతగాళ్ల సాయంతో కాల్వలో వెతికించగా మృతదేహం లభించింది. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

పాతమంచిర్యాల: పౌరహక్కులు, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీసీపీ సుధీర్ రాంనాద్ కేకన్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, నరేందర్, ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, జిల్లా షెడ్యూలు కులాల ఉపసంచాలకులు రవీందర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సివిల్ రైట్స్ డే సభలకు పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ, అటవీ, ఆరోగ్య, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలన్నారు. డీసీపీ సుధీర్‌రాం నాథ్‌కేకన్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను 60 రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, రెండు మూడు రోజుల్లో ఆదిలాబాద్ నుంచి అట్రాసిటీ కోర్టు మంచిర్యాలకు రానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

వేసవికాలం సమీపిస్తున్నందువల్ల మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో మిషన్ భగీరథ ముఖ్య అభియంత బీసీ జ్ఞానకుమార్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైప్‌లైన్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రిడ్ ఈఈ మధుసూదన్, పీఆర్ ఈఈ ప్రకాశ్, ఆర్‌అండ్ బీ ఈఈ రాము, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ల ఉత్తర్వులు విడుదల చేయాలి

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): లేబర్ కమిషనర్ ఎదుట కార్మిక సంఘాలు, కంపెనీకి మధ్య జరిగిన అగ్రిమెంట్ల ఉత్తర్వులను యాజమాన్యం విడుదల చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్కే5 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియాలో జరిగిన అగ్రిమెంట్లు అమలుకావడం లేదన్నారు. 2011లో అలవెన్సులపై ఐటీ మాఫీ చేసే ఒప్పందం అనంతరం క్యాడర్ స్కీం ఒప్పందాలను అమలు చేయలేదన్నారు. ఒప్పందాలు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించి ఏం లాభమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టనున్న ‘చలో ఢిల్లీ’ యాత్రను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, సెక్రటరీ భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చంద్రశేఖర్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ముల్కల్ల ఇటుకబట్టీలో చిన్నారి మృతి



రెడ్డి దీపిక (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులోని ఓ ఇటుకబట్టీలో రెడ్డి దీపిక(3) అనే చిన్నారి అస్వస్థతతో మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కోటపల్లి మండలం నక్కలపల్లికి చెందిన రెడ్డి శారద, రాములు దంపతులు ముల్కల్ల ఇటుక బట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. దంపతుల కుమార్తె దీపిక మంగళవారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. వాంతులు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇటుకబట్టి యజమాని గుట్టుచప్పుడుగా చిన్నారి మృతదేహాన్ని సొంతూరికి తరలించి అక్కడే అంత్యక్రియలు జరిపించారు. ఇటుకబట్టీల యజమానులు కూలీల ఆరోగ్యంపై పట్టించుకోకుండా వారి ప్రాణాలతో చెలగాలమాడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు సీజ్



మంచిర్యాలలో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మంచిర్యాలక్రైం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున మైనింగ్ సిబ్బందితో కలిసి గోదావరి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

తాండూర్‌లో నాలుగు ...

తాండూర్(బెల్లంపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు. తాండూర్ మండలం అచ్చులపూర్ శివారులోని వాగులో నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

‘లీకేజీ’కి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- టీజేఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.బాబన్న



మాట్లాడుతున్న టీజేఎస్ నాయకుడు బాబన్న

పాతమంచిర్యాల: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.బాబన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లీకేజీల వెనుక కేవలం ఇద్దరు ఉద్యోగుల హస్తం ఉందని మంత్రి కేటీఆర్ వాస్తవాలను పక్కదోవ పట్టించడమే అన్నారు. పాలకుల అసమర్థత వల్లే ప్రశ్నాపత్రాలు లీకేజీ అవుతున్నాయని, అది పెద్దల అండదండలతో ఒక వ్యాపారంగా ఎదిగిందన్నారు. ఫలితంగా విద్యార్థులు భవిష్యత్‌పై నమ్మకం కోల్పోయారన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనేల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రదీప్, విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ సిరాజ్, నాయకులు ప్రవీణ్, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవి సత్యం, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఔషధాల ధరల పెంపు ఉపసంహరించుకోవాలి’



మాట్లాడుతున్న మోతె రాజలింగు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రైట్ టూ హెల్త్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మోతె రాజలింగు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సల్లో రోగులకు ఉపశమనం కలిగించే ఔషధాల ధరలను ఏప్రిల్ మాసం నుంచి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వలన లక్షలాది మంది పేదలపై భారం పడుతోందన్నారు. మందుల ధరల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిత్వ శాఖకు వినతిపత్రం పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోశం, చిరంజీవి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ పరిశీలించిన చీఫ్ సెక్యూరిటీ అధికారి



హద్దులు పరిశీలిస్తున్న చీఫ్ సెక్యూరిటీ అధికారి

చెన్నూర్: పట్టణం సమీపంలోని గోదావరినదిలో ఉన్న ఇసుక క్వారీని బుధవారం సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్‌రావు పరిశీలించారు. సర్వేయర్ తిరుపతిని అడిగి హద్దులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైన అక్రమాలు చోటు చేసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్స్‌పెక్టర్ అజీమొద్దీన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వక ఈడీ దాడులు సరికాదు



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఉద్దేశపూర్వకంగా ఈడీ దాడులతో పాటు వారిని వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేయడం బీజేపీ ప్రభుత్వ హేయమైన రాజకీయాలకు నిదర్శనమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. ప్రశ్నించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు రాజ్యాంగబద్ధమైనప్పటికీ బీజేపీ ప్రభుత్వం హరించి వేస్తుందన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి బీజేపీ హటావ్ భారత్‌కో బచావ్ నినాదంతో సీపీఐ పోరాటాలకు సిద్ధమవుతోందని వివరించారు. ఏప్రిల్ 14న మొదలైన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం మే 14 వరకు కొనసాగనుందని, ఇందులో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలను కలుపుకుని ప్రజా సమస్యలపై పోరాడటం చేస్తామని తెలిపారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి
- ఘనంగా జామ్డా ఆశ్రమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవం

నార్నూర్: పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యసాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి అన్నారు. మండలంలోని జామ్డా బాలికల ఆశ్రమ పాఠశాల గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతిప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ఎవరెస్ట్ శిఖరం అధిరోహిత మాలోత్ పూర్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల్లో విద్య నైపుణ్యం పెంచడానికి కార్యక్రమాలు చేపడుతూ వంద శాతం ఫలితాల సాధన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. తల్లిదండ్రులు చిన్నచిన్న పండుగలకు విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లి వారి విద్యకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చదువు ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యతను వెలికితీసి పోటీ ప్రపంచం ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఎవరెస్టు శిఖరం అధిరోహిత మాలోత్ పూర్ణ మాట్లాడుతూ ఆడపిల్లలు భయపడకుండా ముందుకెళితే ఏదైనా సాధ్యమేనని తెలి పారు. ఒక లక్ష్యం పట్టుదల ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని సూచించారు. జీవితంలో ఆరోగ్యం, బాధ్యత, లక్ష్యం ఈ మూడు ఉంటే ఉన్నత శిఖరానికి చేరుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.